## క్లుప్తంగా

### బుద్ధుని బోధనలు ఆచరణీయం



ఆదుర్రు బుద్ధవిహార్‌లో వైశాఖ పౌర్ణమి పూజల్లో పాల్గొన్న భూపతి, వేమా

**మామిడికుదురు:** భగవాన్ గౌతమ బుద్ధుని బోధనలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని ఆదుర్రు బుద్ధవిహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తెలిపారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఆదుర్రు బుద్ధవిహార్ ట్రస్టు కార్యాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్ధవిహార్ ట్రస్టులో బుద్ధుని విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి పూజలు చేశారు. గౌతమ బుద్ధుని చూపిన మార్గంలో నడవాలని అన్నారు. మానవుడు కోరికలను అదుపులో ఉంచుకోవాలన్నారు. సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, బుద్ధవిహార్ ట్రస్టు ప్రతినిధులు మెండు ప్రతాప్‌కుమార్, భయ్యా మోహన్, కుడుపూడి సురేష్, పెదసింగు స్వామి, కోటిపల్లి సాయిబాబు, కడలి కృష్ణారావు, పులపర్తి కృష్ణ, కొంబత్తుల సుమన్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న గ్రూపు సభ్యులు

**మలికిపురం:** విశ్వేశ్వరాయపురం గ్రామంలో రెండు రోజుల కిందట ప్రమాదవశాత్తు ఓ ఇల్లు కాలిపోయింది. ఈ ఘటనలో బాధితురాలు నేదునూరి మహాలక్ష్మి కుటుంబానికి 'నిన్ను వలె పొరుగు వారిని ప్రేమించు' అనే గ్రూపు ద్వారా సభ్యులు ఆర్థిక సాయం అందించారు. సభ్యులు బూసి జాన్‌మోసే, మట్ట రవి, జిల్లెల్ల ఉదయ్‌కిరణ్, ఉండు రాజేష్ ఆధ్వర్యంలో రూ.7,500 సాయం చేశారు.

### జీవ వైవిధ్యంతోనే మనుగడ

**మలికిపురం:** విశ్వేశ్వరాయపురంలో గురువారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ వారోత్సవాలు జరిగాయి. జనవిజ్ఞాన వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురంలో మలికిపురం శాఖ అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై ప్రతి జీవి పరస్పరం సహకరించుకుంటూ బతుకుతాయన్నారు. జనవిజ్ఞాన వేదిక సభ్యుడు, అధ్యాపకుడు నక్కా రమేష్ మాట్లాడుతూ ప్రతి జీవి వైవిధ్యంతో పరస్పరం సహకరించుకుంటూ మనుగడ సాగిస్తున్నాయన్నారు. జీవ వైవిధ్యంతోనే మనకు తాగునీరు, ఆహారం, ఆరోగ్యం, ఔషధాలు అందుతున్నాయన్నారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు.

### పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

**అంబాజీపేట:** పిల్లలకు పుస్తక పఠనంపై తల్లిదండ్రులు ఆసక్తి పెంచాలని రాబిన్ హుడ్‌ఆర్మీ స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు ఎస్.శిరీషా అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం జరిగింది. గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన పిల్లలతో పుస్తక పఠనం, కథలు చెప్పడం వంటి కార్యక్రమాలను గురువారం నిర్వహించారు.

### వేద విద్యార్థులకు పరీక్షలు

**అంబాజీపేట:** శ్రీగోదావరి మండల వేదశాస్త్ర ప్రవర్ధక సభ చారిటబుల్ ట్రస్ట్ 73వ వార్షికోత్సవం సందర్భంగా వేద విద్యార్థులకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో వేద పరీక్షలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టావఝుల వెంకట సూర్యనారాయణ మూర్తి, ఆకెళ్ల వెంకట రామకృష్ణ కామేశ్వరశర్మ తెలిపారు. గంగలకుర్రులో జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం స్వగృహంలో చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవ సభ, వేద పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 27, 28 తేదీలలో వేద, శాస్త్ర, శ్రౌత, స్మార్త, అపర, ఆగమ, విద్యలలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణులకు అర్హతను బట్టి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. పరీక్షాధికారులుగా చిర్రావూరి శ్రీరామశర్మ, కడియాల సీతారామ అవధాని, గుళ్లపల్లి సీతారామ శ్రీహర్ష వ్యవహరిస్తారన్నారు. 29న ప్రవర్ధక సభ ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టావఝుల వెంకట సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన మహాసభ జరుగుతుందన్నారు. కార్యక్రమాలలో ట్రస్ట్ కోశాధికారి అయ్యగారి లక్ష్మీనరసింహమూర్తి, సహాయ కార్యదర్శి యేడిది సుబ్రహ్మణ్ శర్మ, సహాయ కార్యదర్శి భమిడిపాటి యజ్ఞేశ్వర ప్రసాద్ పాల్గొంటారని ట్రస్ట్ కార్యదర్శి కామేశ్వరశర్మ తెలిపారు.

### గోవును సంరక్షించిన గ్రామస్తులు

**ఉప్పలగుప్తం:** చల్లపల్లి పంచాయతీ పరిధి వాసాలతిప్పలో ఆపదలో ఉన్న గోవును గ్రామస్తులు రక్షించారు. ఓ ఆవు మేతకు వెళ్లి పంట బోదెలో దిగి రెండు రోజులుగా ఊబిలో కూరుకుపోయి బయటకు రాలేక అపస్మారక స్థితికి చేరుకుంది. దీన్ని గుర్తించిన నక్కా రామేశ్వరానికి చెందిన యువకులు ఆవును బయటకు తీసి స్థానిక పశువైద్యాధికారి కోనే రామారావుకు సమాచారం అందించారు. రామారావు సహాయకుడు గాంధీతో కలిసి ఆవుకు వైద్యం అందించారు.

# సంబరబడి..

- ఉచితంగా ప్రైవేట్ విద్య
- సీఎం జగన్ నిర్ణయంతో మేలు
- మూడు నియోజకవర్గాల్లో తొలివిడతలో 600 మందికి అవకాశం

**తొలి విడత ఎంపికైన విద్యార్థులు**

| మండలం | విద్యార్థులు |
|---|---|
| కొత్తపేట | 108 |
| రావులపాలెం | 57 |
| ఆత్రేయపురం | 32 |
| ఆలమూరు | 64 |
| పి.గన్నవరం | 46 |
| మామిడికుదురు | 74 |
| అంబాజీపేట | 49 |
| అయినవిల్లి | 46 |
| రాజోలు | 80 |
| మలికిపురం | 50 |
| సఖినేటిపల్లి | 44 |



**కొత్తపేట:** రాష్ట్ర ప్రభుత్వం అందరికీ విద్య అందిస్తోంది.. పేద విద్యార్థుల చదువుకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది.. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో వారు ఉచితంగా చదివేందుకు అవకాశం కల్పిస్తోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు పేదలకు కేటాయించేలా చర్యలు తీసుకుంది. ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పిల్లల తల్లిదండ్రులు విద్యాశాఖకు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటికే తొలివిడత ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. విద్యతోనే పేదల స్థితిగతులు మార్చాలనే మంచి సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో అనేక విప్లవాత్మక మార్పులు, నూతన సంస్కరణలు తీసుకు వచ్చారు. ఇందులో భాగంగా 'నాడు- నేడు' పథకంలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించారు. గత ఏడాది నుంచి పేద విద్యార్థులు సమీప ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా ఒకటో తరగతిలో ప్రవేశించి చదువుకునే అవకాశం కల్పించారు.

**పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ**

అన్ని కులాల్లోని పేదలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అభ్యసించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయించాలి. ఆ మేరకు ఆ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఒకటో తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టింది. దరఖాస్తు మొదలు ఎంపిక వరకూ అంతా ఆన్‌లైన్‌లోనే చేపట్టిన ప్రభుత్వం ఈ పథకం అమల్లో పారదర్శకతకు పెద్దపీట వేసింది. అనాథలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్త బాధిత బాలలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఇతర వర్గాలకు 6 శాతం చొప్పున సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మూడు నియోజకవర్గాల్లో తొలి విడతగా 600 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఉచిత అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సంవత్సరానికి చెల్లించాల్సిన ఫీజును ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.6,500 ఉంటుంది. ఈ ఫీజులు అమ్మ ఒడి పథకం కింద విద్యార్థులు చేరిన పాఠశాలలకు ప్రభుత్వమే చెల్లించనుంది.

**ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోండి**



ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా పేదలకు 25 శాతం సీట్లు కేటాయిస్తారు. పేద విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తే లక్ష్యంగా ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందిస్తున్నారు. ఎంపికై అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-మట్టపర్తి హరిప్రసాద్, ఎంఈఓ, కొత్తపేట

**చాలా ఆనందంగా ఉంది**



మాది సామాన్య కుటుంబం. మాకు ఇద్దరు అమ్మాయిలు. పెద్దమ్మాయి తన్మయలక్ష్మి. ప్రైవేట్ పాఠశాలలో చదివించాలనేది మా కోరిక. కానీ ఫీజులు చూస్తే చాలా ఎక్కువగా ఉంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఉచిత విద్యకు అవకాశం కల్పించింది. దరఖాస్తు చేశాం. కోరుకున్న పాఠశాలలో సీటు వచ్చింది. చాలా ఆనందంగా ఉంది.

-కుమార్తె బొరుసు తన్మయలక్ష్మితో సత్యవాణి, కొత్తపేట

### 'పది' సప్లిమెంటరీ పరీక్షకు ఏర్పాట్లు

**రాజోలు:** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని, దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ నల్లి మోహనరావు గురువారం తెలిపారు. రాజోలు బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో కేంద్రంలో 150 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. పరీక్ష రుసుంతో సంబంధం లేకుండా హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులు నేరుగా పరీక్షలకు హాజరు కావొచ్చన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచామన్నారు.

### అధిక లోడ్‌తో ప్రయాణిస్తే కేసులు

**ఆలమూరు:** ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తేలా అధిక లోడ్‌తో ప్రయాణించే వాహనాలపై కేసులు నమోదు చేస్తామని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ హెచ్చరించారు. జొన్నాడ సెంటర్‌లో గురువారం వాహన తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పెరవలి నుంచి మండపేటకు ఓవర్ లోడ్‌తో వస్తున్న ఊక లారీలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధించారు. అలాగే జూన్ నాలుగు వరకూ మండలంలో బాణసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బాణసంచా కాల్పులు, ర్యాలీలు నిషేధం



అంబాజీపేటలో విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌కుమార్

**అంబాజీపేట:** ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎవరు గెలిచినా బాణసంచా కాల్చడం, ర్యాలీలు చేయడం నిషేధమని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బహిరంగ సభలు, ఊరేగింపులు, విజయోత్సవాలు నిర్వహించరాదన్నారు. వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి పార్టీ అభ్యర్థితో పాటు ఏజెంట్ ఒక్కరు మాత్రమే కౌంటింగ్ ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయిన 48 గంటల వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని.. ఎవరూ బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు నిర్వహించరాన్నారు. వాట్సాప్‌ల్లో విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టింగ్‌లు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేంది లేదని హెచ్చరించారు. ఎస్సై కె.చిరంజీవి పాల్గొన్నారు.

## వెంకన్న స్వామికి వైభవంగా చక్రస్నానం



అంబాజీపేటలో వెంకన్న స్వామికి చక్రస్నానం నిర్వహిస్తున్న భక్తులు

**అంబాజీపేట:** కొర్లపాటివారిపాలెంలో భూ సమేత వేంకటేశ్వరుని ఆలయంలో కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి చక్రస్నానం గురువారం జరిగింది. ఆలయ అర్చకుడు పాణింగపల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. గంగలకుర్రు అగ్రహారంలో ఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీ భూసమేత కేశవస్వామివార్లకు త్రిశూల చక్రస్నానాలు అత్యంత వైభవంగా జరిపారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి వెంకటనరసింహశర్మ, సుదర్శనం కేశవాచార్యులు పూజలు చేశారు. గోర్తి పల్లయ్య పంతులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

**మాచవరంలో ఇటికాలమ్మ తీర్థం**

మాచవరంలో ఇటికాలమ్మ అమ్మవారి తీర్థం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ ఆడపడుచులతో పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకుని చలివిడి, పానకం, ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మైపాల నాగబాబు, బండారు కొండ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. గురువారం రాత్రి జాతరలో గరగ నృత్యాలు, వీరనాట్యం, శక్తివేషాలు ఆకట్టుకున్నాయి.

**ఆత్రేయపురం:** ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి, జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీరమా సత్యనారాయణ స్వామివార్ల చక్రస్నానం గురువారం జరిగింది. స్వామివార్లకు పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం, గ్రామోత్సవం తదితర పూజలు నిర్వహించారు. ఈ ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

## భక్తులకు విసనకర్రల పంపిణీ



అంతర్వేదిలో భక్తులకు మామిడిపండ్లు, విసనకర్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలోని స్వామివారి సన్నిధిలో గురువారం వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని భక్తులు, అర్చకులకు దేవస్థానం మామిడిపండ్లు, విసనకర్రలు పంపిణీ చేసింది. వీటిని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్ అందజేశారు. తొలుత స్వామివారి సన్నిధిలో మామిడిపండ్లు, విసనకర్రలు ఉంచి అర్చకులు విశేష పూజలు చేశారు. ఉక్కబోత నుంచి ఉపశమనానికి ఈ విసనకర్రలు పంపిణీ చేపట్టినట్టు సత్యకిరణ్ అన్నారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేదపండితుడు చింతా వెంకట శాస్త్రి, అర్చకులు పాల్గొన్నారు.

## హుండీల ఆదాయం లెక్కింపు



చింతలూరులో హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవదాయశాఖ అధికారులు

**ఆలమూరు:** చింతలూరులోని శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కించగా, రూ.21.29 లక్షలు వచ్చింది. స్థానిక అమ్మవారి ముఖ మండపం ఆవరణలో రామచంద్రపురం దేవదాయశాఖ తనిఖీ ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలాజీ రామ్‌ప్రసాద్, కార్యనిర్వాహక అధికారి మద్దూరి శివరామకృష్ణ సమక్షంలో గ్రామస్తుల పర్యవేక్షణలో ఆలయంలో ఉన్న ఏడు హుండీలను గురువారం లెక్కించారు. 2024 ఏప్రిల్ 19 నుంచి మే 23 వరకూ 35 రోజులకు గాను ఈ ఆదాయం లభించిందని ఈఓ కృష్ణ పేర్కొన్నారు. జేఏ డి.భాస్కర్ శ్రీనివాస్, వీఆర్ఓ కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ అంతరాయం

**పి.గన్నవరం:** నరేంద్రపురం సబ్ స్టేషన్‌లోని నరేంద్రపురం, జి.పెదపూడి ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. ఆదిమూలం వారిపాలెం, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, గుత్తులవారిపాలెం, ఊడిమూడి, ఊడిమూడిలంక, జి.పెదపూడి, జి.పెదపూడిలంక, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సిర్రావారిలంక, పెదమల్లంక గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

### బీజేపీ కోర్ కమిటీ సమావేశం

**మలికిపురం:** మలికిపురంలో బీజేపీ నాయకుడు ఇందుకూరి అచ్యుతరామరాజు ఇంటి వద్ద రాజోలు నియోజకవర్గ పార్టీ కోర్ కమిటీ సమావేశం గురువారం జరిగింది. నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కార్డు సభ్యులను రైతులకు అనుసంధానం చేయాలని కోరారు. రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చంపాటి శివరామకృష్ణంరాజు, ఇందుకూరి అచ్యుతరామరాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెల్లింది త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## 'నాడు-నేడు' పనుల పరిశీలన



లక్కవరంలో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న మధుసూదనరావు

**మలికిపురం:** పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న 'నాడు-నేడు' పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ అధికారి ఎ.మధుసూదనరావు సూచించారు. లక్కవరంలోఎంపీపీ పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. నాడు-నేడు పనుల్లో నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడొద్దని సూచించారు. విద్యాకానుక ఐదో విడత పంపిణీ కోసం లక్కవరం ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్లను పరిశీలించారు. అనంతరం జగనన్న విద్యాకానుక మండల కాంపోజిట్ టీమ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారులు ఎం.విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణ, ఎంఐఎస్ ఆర్.రవి, సీఆర్పీలు పాల్గొన్నారు.

**రాజోలు:** పాఠశాలలు పునః ప్రారంభం నాటికి నాడు-నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ అధికారి మధుసూదనరావు సూచించారు. గురువారం ఆయన మండలంలో జరుగుతున్న నాడు-నేడు రెండో దశ పనులను పరిశీలించారు. విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. శివకోడు ఉన్నత పాఠశాలలోని విద్యా కానుక స్టాక్ పాయింట్‌లో పాఠ్య, నోట్ పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఎంఓ బొరుసు సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు నల్లి మనోహరం, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల బాట పట్టిన విద్యార్థులు



వివరాలు సేకరిస్తున్న మామిడికుదురు డిగ్రీ కళాశాల విద్యార్థులు

**మామిడికుదురు:** రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌తో విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన పెరుగుతుందని మామిడికుదురు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ తెలిపారు. మామిడికుదురు, పి.గన్నవరం మండలాల్లోని అప్పనపల్లి, ఆదుర్రు, లంకల గన్నవరం గ్రామాల్లో గురువారం కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు పేరుతో కళాశాల విద్యార్థులు సామాజిక సర్వే చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వివరాలు నమోదు చేశారు. ఆరోగ్య, స్వచ్ఛత, అక్షరాస్యత పట్ల చైతన్యం కలిగించారు. బడి ఈడు పిల్లలందరినీ తప్పకుండా పాఠశాలలకు పంపించాలని సూచించారు. ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ విజయ్ సత్యప్రసాద్ యర్రంశెట్టి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## ఈ బంధం.. కలకాలం

- ఆప్యాయతకు నిదర్శనం అన్నదమ్ములు
- నేడు ప్రపంచ సోదరుల దినోత్సవం



**కొత్తపేట:** అన్నా.. తమ్ముడు.. సోదరా.. ఈ మాటల్లో ఆప్యాయత ఎనలేనిది. ఒకే తల్లి గర్భం నుంచి పుట్టి పెరిగిన అన్నదమ్ములే కాదు వరుసకు సోదరులుగా భావించుకునే స్నేహితుల మధ్య ప్రేమాభిమానాలకు హద్దులుండవు. అమ్మ ప్రేమ.. నాన్న మమకారం కలిపి తోడుగా పుట్టినవాడే తోడబుట్టినవాడు. అమ్మలోని మొదటి అక్షరం.. నాన్నలోని రెండో అక్షరం.. కలిసిన పదమే.. 'అన్న'. చివరికి తోడూ నీడగా నిలిచే వారే అన్నదమ్ములు. ఈ నెల 24వ తేదీ శుక్రవారం అంతర్జాతీయ అన్నదమ్ముల దినోత్సవం (వరల్డ్ బ్రదర్స్ డే). ఈ వేడుకలకు కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజవర్గాల్లోని అన్నదమ్ములు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. సంబరాల్లో మునిగితేలనున్నారు. పురాణ ఇతిహాసాలను అధ్యయనం చేస్తే అన్నదమ్ముల బంధానికి ఎంతో విలువ ఉంది. త్రేతాయుగంలో రాముడు అరణ్యవాసం చేస్తే తమ్ముడు లక్ష్మణుడు కూడా అన్నతో పాటు అరణ్యవాసానికి వెళ్లడం, సామ్రాజ్యానికి అధినేత అయిన భరతుడు అన్న రాముడు పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యపాలన చేయడం రామాయణంలో చూశాం.. ద్వాపరయుగంలో పాండవులు ఐదుగురిలో పెద్దవాడైన ధర్మరాజు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడిన తమ్ముళ్ల గురించి భారతంలో విన్నాం. అలాంటి అన్నదమ్ముల అనుబంధం దేవుడిచ్చిన వరం. ఇలా ఇప్పుడు ప్రతి కుటుంబంలోనూ ఓ అన్న ఉంటాడు. ఆయన సర్వం బాధ్యతలను మోస్తాడు. కొన్ని కుటుంబాల్లో అయితే తమ్ముళ్లు కూడా పెద్దన్నలా బాధ్యతలను తమ భుజాలపై వేసుకుని కుటుంబాన్ని ముందుకు నడిపిస్తుంటారు. 2005 నుంచి బ్రదర్స్ డే (అన్నదమ్ముల దినోత్సవం) చేసుకోవడం మొదలైంది. అమెరికాలోని అలబామా రాష్ట్రానికి చెందిన శిల్పి, రచయిత సీ డేనియర్ రోడ్స్ బ్రదర్స్ డేను తొలిసారిగా జరుపుకొన్నాడు. అప్పటి నుంచి సోదరుల దినోత్సవం చేసుకోవడం మొదలైంది.

**ఇతరులకు ఆదర్శంగా..**



అన్నదమ్ముల అనుబంధం అంటే ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. మేము ఇద్దరు అన్నదమ్ములం. ఇంకా మా చిన్నాన్న, పెదనాన్న, పెద్దమ్మ, చిన్నమ్మ కుమారులు ఉన్నారు. అందరం ఒకరి పట్ల ఒకరం ఆప్యాయంగా, అభిమానంగా మెలుగుతాం. ఒకరికొకరం గౌరవ మర్యాదలు ఇచ్చి పుచ్చుకుంటాం.

-నల్లా గోపి, కొత్తపేట

**కలసిమెలసి ఉంటాం**



మా అన్నదమ్ములం స్నేహితుల్లా కలసిమెలసి ఉంటాం. చిన్నతనం నుంచీ మా నాన్న అబ్దుల్ సత్తార్ క్రమశిక్షణలో అన్న బాషా అడుగు జాడల్లో పెరిగాం. ఒకరినొకరం గౌరవించుకుంటూ సమాజంలో మంచి సోదరులుగా జీవనం సాగిస్తున్నాం. ఏ ఒక్కరి ఇంట్లో కార్యక్రమం అయినా మా అందరి ఇంట్లో కార్యక్రమంగా భావిస్తాం. పండుగగా జరుపుకొంటాం.

-షేక్ గౌస్, కొత్తపేట

## అలరించిన అన్నమయ్య కీర్తనలు



అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తున్న మహిళలు

**అమలాపురం టౌన్:** అన్నమయ్య 600వ జయంతి సందర్భంగా స్థానిక భూపయ్య అగ్రహారంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆర్ట్ ఫ్యామిలీ ఆధర్యంలో అన్నమయ్య కీర్తల ఆలాపన, కోలాటం భక్తులను అలరించాయి. గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులైన మహిళలు అన్నమయ్య, రామదాసు కీర్తనలను రాగయుక్తంగా ఆలపించారు. కోలాటం లయబద్ధంగా సాగింది. ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు టి.సౌమ్యలక్ష్మి, పేరి వాణి, ఉషారాణి వారి శిష్య బృందం ఆధ్వర్యంలో కీర్తనల ఆలాపన, కోలాట కార్యక్రమాలు జరిగాయి. మృదంగం రఘునాథ్, వయొలిన్ గణపతి వాద్య సహకారం అందించారు. ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, భూపయ్య అగ్రహారం పెద్దలు కొత్తూరి శ్రీనివాస్, జిల్లెళ్ల గోపాల్, బాల భక్త సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.